క్లుప్తంగా...

అభినందనలు



సోమేష్ కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా ఎన్నికైన పూర్వ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్‌కు టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ సాధనలో సోమేష్‌కుమార్ పాత్ర ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. చీఫ్ సెక్రటరీగా చేసిన అనుభవంతో సోమేష్ కుమార్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారన్నారు. సోమేష్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో చీఫ్ సెక్రటరీగా పనిచేసినప్పుడు ఉద్యోగులందరూ ఎల్లవేళల తనకు సహకరించారని, ఇకమీదట కూడా తన వెంట ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ సంఘాల చేస్తున్న కార్యక్రమాలు ఎంతో భేష్‌గా ఉన్నాయన్నారు.

శంకర్‌జీకి ఘన నివాళి



వేడుకల్లో హరినాథ్‌రెడ్డి, అశ్వినిమార్గం, వినయ్‌కుమార్ ముదిరాజ్

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవస్థాపకుడు శంకర్‌జీ 111వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ శ్రేయస్సుకు, సంఘ సేవకుడిగా ఆయన చేసిన పలు పనులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌జీ మెమోరియల్ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి వినయ్‌కుమార్ ముదిరాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్వినిమార్గం ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు.

అగ్ని ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరం

గౌలిపురా: జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సర్కిల్–9 టౌన్ ప్లానింగ్ ఏసీపీ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై దర్యాప్తు ముమ్మరం చేసినట్లు మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శివ కుమార్ తెలిపారు. అగ్ని ప్రమాదంపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నియామకం



ప్రొ. మధుకర్‌ను అభినందిస్తున్న ప్రొ. కొడాలి సుందర్‌కుమార్

విజయనగర్‌కాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ జి.మధుకర్ నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ కవితా దరియాని రావు ఆదేశాల మేరకు శుక్రవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ మధుకర్‌కు ఉత్తర్వులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మధుకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నియమ నిబంధనలను, యూనివర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి ప్రవేశాల ప్రక్రియలో పారదర్శకంగా నిర్వహిస్తానన్నారు. యూనివర్సిటీలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సహకారంతో పాటు విద్యార్థుల తోడ్పాటు అవసరమన్నారు. ఈ సందర్భంగా మధుకర్‌ను యూనివర్సిటీ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందించారు.

ఆకట్టుకుంటున్న సరస్వతి విద్యానికేతన్ సమ్మర్ క్యాంప్



వినూత్నంగా డ్రాయింగ్‌లు వేసిన చిన్నారులు

జియాగూడ: వేసవి శిక్షణ శిబిరాల్లో చిన్నారులు ఆర్ట్స్, క్రాఫ్ట్, డ్రాయింగ్ శిక్షణ పొందుతూ తమదైన శైలిలో తయారు చేసి ఆకట్టుకుంటున్నారు. జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌లు చిన్నారులు నెలరోజుల పాటు శిక్షణలు పొందుతున్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలి, ప్రిన్సిపాల్ సునేత్ర మాట్లాడుతూ.. వేసవి శిక్షణ శిబిరాల్లో చిన్నారులకు అన్నిరంగాల్లో శిక్షణను ఇస్తూ భవిష్యత్తులో ఎదిగేందుకు సూచనలు ఇస్తున్నామని పేర్కొన్నారు. అలాగే స్పోకెన్ ఇంగ్లిష్, హ్యాండ్ రైటింగ్, ఇండోర్ గేమ్స్, యోగా తరగతులను, నృత్యం, పాటలను నేర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ప్రారంభోత్సవంలో మంత్రులు తలసాని, మహమూద్ అలీ, ఎమ్మెల్యే రాజాసింగ్, నందకిశోర్‌వ్యాస్ బిలాల్

అబిడ్స్: పేద ప్రజలకు సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. అబిడ్స్ మురళీధర్‌బాగ్‌లో రూ.10 కోట్లతో నిర్మించిన 120 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే రాజాసింగ్, గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం దాదాపు రూ.10 లక్షలతో ఒక్క డబుల్‌బెడ్‌రూమ్ నిర్మించిందని, దాని విలువ మార్కెట్‌లో రూ.కోటి ఉంటుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం కోటి రూపాయాల విలువైన డబుల్ బెడ్‌రూమ్‌లను పేదలకు అందిస్తుందన్నారు. పేదలకు, బడుగు వర్గాలకు డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించి సొంతింటి కలలను నిజం చేయడమే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి అంటే దేశంలోనే తెలంగాణ నెంబర్:1 అన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. ఈ డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణాల్లో షెటర్లు నిర్మించారని అవి స్థానికులకు కేటాయించాలన్నారు. ప్రజలకు అభివృద్ధి చేసేందుకు తాను ముందుంటానని పేర్కొన్నారు. మంత్రి తలసాని పార్టీలకు అతీతంగా ఎవరు వెళ్లినా పనులు చేసిపెడుతున్నారని ప్రశంసించారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ చాలా బాగా ప్రజలకు సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఒకేసారి మంత్రి తలసానిపై ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశంసల వర్షం కురిపించడంతో సభలో ఉన్న ప్రజలందరూ అవాక్కయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, నగర గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీఆర్ఎస్ నేతలు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, పూజావ్యాస్ బిలాల్, ఆల పురుషోత్తమ్‌రావు, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రసాద్, జీహెచ్ఎంసీ అధికారులు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మక నాటకాలే రక్తికడతాయి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మహ్మద్ అలీ బేగ్

నాంపల్లి: రంగస్థల నాటక ప్రదర్శనలో కథ, దర్శకత్వం, నటనలతో పాటు సృజనాత్మకతతో సాంకేతికతను జోడించినపుడే నాటకం రక్తికడుతుందని ప్రముఖ రంగస్థల కళాకారులు పద్మశ్రీ మహ్మద్ అలీ బేగ్ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో శుక్రవారం వర్సిటీలోని ఎన్టీఆర్ కళా మందిరంలో ప్రారంభమైన పది రోజుల జాతీయ రంగస్థల సాంకేతిక శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహ్మద్ అలీ బేగ్ ప్రసంగిస్తూ.. నాటక రంగ కళాకారులు పాశ్చాత్య సాహిత్య నాటకాల వైపు వెళ్లకుండా భారతీయ సంస్కృతికి అద్దం పట్టే చారిత్రక, సాంఘీక, ఇతి వృత్తాలను రంగస్థలంపై ప్రదర్శించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిబిరంలో శిక్షణ పొందిన కళాకారులు టీవీ, సినిమా రంగాలలో రాణిస్తూనే గ్రామీణ యువతకు రంగస్థల నాటకాలను పరిచయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ.. నాటక ప్రదర్శనకు కావాల్సిన సాంకేతిక ఆవశ్యకత, ప్రాముఖ్యతను వర్సిటీ రంగస్థల విద్యార్థులకు తెలియజెప్పేందుకు ఏర్పాటు చేసిన పది రోజుల శిక్షణా శిబిరం ఉపయుక్తంగా ఉంటుందని, ప్రతి ఏడాది కోర్సు మధ్యలో ఇలాంటి శిబిరాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. వర్క్ షాపు సంచాలకులు నాటక రంగ నిపుణులు ఎల్‌వి. భూషణ్, రంగస్థల కళల శాఖాధిపతి ఆచార్య కోట్ల హనుమంతరావు శిక్షణా శిబిరం వివరాలను తెలియజేశారు.

జీఎన్ఐటీఎస్‌లో కోడింగ్ పోటీలు



గోల్కొండ: కోడింగ్‌లో నైపుణ్యం గల వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని డయాటోస్ క్యాంపస్ అంబాసిడర్ శిరీష గూడ అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి. నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కోడింగ్ పోటీలో నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులు నిర్వహించే ది ఎరూడైట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను డయాటోస్–ఇ–టూ–ఇ హైరింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష గూడ మాట్లాడుతూ.. ఎరూడైట్స్ క్లబ్‌ను విద్యార్థులు స్వయంగా స్థాపించి ముందుకు సాగడం గొప్ప విషయమన్నారు. ఈ కోడింగ్ పోటీల్లో 4 ప్రశ్నలు ఉంటాయని, 45 నిమిషాల నిడివి గల ఈ పరీక్ష విద్యార్థినుల కోడింగ్ నైపుణ్యానికి పదును పెడుతాయన్నారు. కాగా ఈ పోటీల్లో స్వాధిక మొదటి బహుమతిని, భావన 2వ బహుమతిని పొందగా, లక్ష్మీ 3వ బహుమతిని పొందారు. కాగా వీరికి నగదు పురస్కారాలతో పాటు డాక్టర్ జరైన్ సింగ్, నాగశ్రీలు అందించి విజేతలను సన్మానించారు.

నానల్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్



మజ్లిస్ కార్పొరేటర్లు, నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సేవలో మజ్లిస్ ఎప్పుడూ ముందుంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో నానల్‌నగర్ కార్పొరేటర్, మజ్లిస్ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానల్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నానన్నారు. ఈ డివిజన్‌కు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. గతంలో లాగా ఈ వర్షాకాలంలో నానల్‌నగర్ డివిజన్‌లో నిజాం కాలనీ, అల్ హస్నాత్ కాలనీలో ముంపు సమస్య ఉండదని ఆయన అన్నారు. అల్ హస్నాత్ కాలనీ ఎగువ ప్రాంతంలోని మిలటరీ ప్రదేశంలో ఉన్న బుల్కాపూర్ నాలా దారి మళ్లింపు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. నదీమ్ కాలనీ, బాల్‌రెడ్డినగర్, రియాసత్‌నగర్ కాలనీలలో కొత్త డ్రైనేజీలు వేశామని, ఈ కారణంగా వర్షపు నీరు రోడ్లపై నిలిచి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, గోల్కొండ డివిజన్ నాయకులు బదర్ ఉద్దీ, హబీబ్ చావూస్ తదితరులున్నారు.

అధ్యాపకులకు స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ చెల్లించాలి

నాంపల్లి: ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ పూర్తయినా అధ్యాపకులకు ఇప్పటివరకు రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడం దారుణమని, ఆలస్యం చేయకుండా రెమ్యూనరేషన్ ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీపీటీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ఆర్‌జేడీ జయప్రద బాయిని కలిసి మెమొరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్, ప్రాక్టికల్‌లో పాల్గొన్న అధ్యాపకులకు రెమ్యూనరేషన్ ఇప్పటి వరకు ఇవ్వకపోవడం వల్ల అధ్యాపకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

జియాగూడ కేటీఎస్ విజయ ఢంకా

జియాగూడ: జియాగూడలోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతిలో 98 శాతం ఉత్తీర్ణత సాధించి విజయ ఢంకా మోగించారు. శుక్రవారం స్కూల్ కార్యాలయంలో బి.నికిత 9.8 గ్రేడ్, హెచ్.యశ్మిత 9.7 గ్రే డ్ సాధించగా 18 మంది విద్యార్థులు 9.0 గ్రేడ్ సాధించగా వారిని తెలంగాణ కేటీఎస్ స్కూల్స్ చైర్మన్ ఎంఎం షరీఫ్, వైస్ చైర్మన్ ఐఐటీ శ్రీనివాస్, అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి బొకేలు అందజేసి అభినందించారు. బ్రాంచ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, శ్రీకాంత్, ఇన్‌చార్జీలు గురుప్రీత్, ప్రసన్న కుమారిచ, సరిత, మాధురి పాల్గొన్నారు.

ఝాన్సీపై దాడి చేసిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



డీజీపీ అంజనీకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కమల్ సురేష్

నాంపల్లి: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు ఏబీవీపీ తలపెట్టిన శాంతియుత నిరసనలో భాగంగా గురువారం ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కుమారి ఝాన్సీపై హుమయూన్ నగర్ పోలీసులు చేసిన దాడిని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌ను కలిసి ఝాన్సీపై దాడికి పాల్పడిన హుమయూన్ నగర్ పోలీసు సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమల్ సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా విశ్వవిద్యాలయాలుగా చలామణి అవుతున్న గురునానక్ విశ్వవిద్యాలయం, శ్రీనిధి విశ్వవిద్యాలయంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విశ్వవిద్యాలయాల మాయాజాలంలో మోసపోయిన నాలుగు వేలకు పైగా విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గురువారం మే 11న తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు ఏబీవీపీ కార్యకర్తలు శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారని, ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని అకారణంగా హుమయూన్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడ ముగ్గురు మహిళా పోలీసులు కలిసి ఝాన్సీ హింసిస్తూ, అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించి ఆమె ఫోన్‌ను లాక్కున్నారని ఆరోపించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఏసీపీ ఆర్‌జీ.శివమారుతీ ఆదేశంతో ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో మహిళా కానిస్టేబుల్ తులసితో పాటుగా మరో ముగ్గురు మహిళా కానిస్టేబుల్స్ విచక్షణారహితంగా కొట్టారని వివరించారు. ఝాన్సీపై దాడి చేసిన ఏసీపీ ఆర్‌జీ.శివమారుతీ, సీఐ నారాయణరెడ్డి, మహిళా కానిస్టేబుల్ తులసితో పాటుగా మరో ఇద్దరిపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీకాంత్, పృథ్వీ, సిరివెన్నెల పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరుతుంది’



నందకిశోర్ వ్యాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, మహిళలు

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధిని చూసి పలు పార్టీల వారు, పలు వర్గాల వారు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. దత్తాత్రేయనగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు గోపాల్‌సింగ్ లోథ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దేవురాల సంతోషితో పాటు పెద్ద ఎత్తున వారి అనుచరులు అంతా నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. దత్తాత్రేయనగర్ డివిజన్ ప్రాంతంలో సీనియర్ బీజేపీ నాయకుడు గోపాల్‌సింగ్ లోథ్ ఆయన అనుచరులు బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి పథకాలను చూసి పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. సంతోషి ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా ఉంటూ ఆమెతో పాటు ఆమె అనుచరులు అంతా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడం సంతోషకరమన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తాము ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ మహ్మద్ సలీం, బీఆర్ఎస్ నేతలు పి.అనిత, కవిత, సారిక, జ్యోతి, ప్రియ, శంకర్‌సింగ్, సునిల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘యాదవులకు రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి’

గన్‌ఫౌండ్రీ: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి తక్షణమే యాదవులకు క్షమాపణ చెప్పాలని యాదవ విద్యావంతుల వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చలకాని వెంకట్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాదవకులాన్ని, వృత్తిని అవమానపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి తన స్థాయి దిగజారిచేసిన వ్యాఖ్యలు అగ్రకుల దురహంకారానికి నిదర్శమని దుయ్యబట్టారు.

వివేకానంద స్కూల్ విద్యార్థుల ప్రతిభ




గోల్కొండ: అత్యాధునిక విద్యాబోధన వల్లే ప్రతిఏటా 10వ తరగతిలో తమ విద్యార్థులు సత్తాచాటుతున్నారని గుడిమల్కాపూర్‌లోని వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 10వ తరగతి ఫలితాలు టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశాంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో వివేకానంద హైస్కూల్ ఒక విప్లవంలా ముందుకుసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రైస్ ఫాతిమా తదితరులున్నారు.

యాకుత్‌పురాలో యువకుడిపై దాడి


డబీర్‌పురా: పాతబస్తీలో ఓ యువకుడిని స్థానికులు చితకబాదిన ఘటన శుక్రవారం రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్‌కు చెందిన కార్తీక్(19)కు పాతబస్తీ రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాకుత్‌పురాకు చెందిన ఓ మైనర్ బాలికతో సామాజిక మాధ్యమం ద్వారా పరిచయం ఏర్పడింది. కార్తీక్ మైనర్ బాలిక గత కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమంలో చాటింగ్ చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా మైనర్ బాలికను కలవడానికి శుక్రవారం యాకుత్‌పురాకు వచ్చాడు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న ఓ పాన్ షాప్ వద్ద కార్తీక్ ఫోన్లో బాలికతో మాట్లాడుతుండగా గమనించిన స్థానిక కొంత మంది యువకులు కార్తీక్ ని తీసుకొని వెళ్లి దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడిన యువకులు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో కార్తీక్ ఒప్పుకున్నాడు.

దీంతో ఆ యువకులు కార్తీక్ ను వదిలేశారు. అనంతరం కార్తీక్ తన తండ్రితో కలిసి జరిగిన దాడిపై రెయిన్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెయిన్ బజార్ పోలీసులు కార్తీక్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తాచాటారు



ఆనందీదాస్



ఆరాధియా నరైన్



స్నిగ్ధా

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. 46 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఆనందీదాస్ 96.6 శాతం, ఆరాధియా నరైన్ 92.8 శాతం, స్నిగ్ధా 90.8 శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వీరేంద్ర కుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సీబీఎస్ఈ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 101 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. కె.ఓజస్వి 95.4 శాతం, నమన్ చౌరాసియా 90.8 శాతం, పి.ధరణి 89.8 శాతం, డి.రోమా 89.8 శాతం మార్కులో ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరికి ప్రిన్సిపాల్ వీరేంద్ర కుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో నర్సులకు అవార్డులు ఇస్తున్న డాక్టర్ మజహర్ ఉల్లా

గోల్కొండ: నర్సులు ప్రాణదాతలని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా అన్నారు. శుక్రవారం ఏరియా ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మహ్మద్ ఖాజా రవూఫ్ ఉద్దీన్‌తో కలిసి స్టాఫ్ నర్సులకు సన్మానం చేసి మెమొంటోలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యుల సేవల కంటే నర్సుల సేవలే అత్యంత ప్రధానమైనవని, ఆస్పత్రిలో ఉండే రోగులను అంటిపెట్టుకుని ఉండి అనుక్షణం వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునే నర్సులు ఉన్నతమైన వ్యక్తిత్వం కలవని ఆయన అన్నారు.

బోనాల ఉత్సవాలకు ముందే అభివృద్ధి పనులు

- ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో కలిసి పాతబస్తీలో జోనల్ కమిషనర్ పర్యటన
- ఆయా ఆలయాల వద్ద చేపట్టాల్సిన పనులపై ఆరా



జోనల్ కమిషనర్‌కు అభివృద్ధి పనులను వివరిస్తున్న మధుసూదన్ గౌడ్ తదితరులు



ద్విచక్ర వాహనంపై పాతబస్తీలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్

చార్మినార్: ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల ప్రారంభానికి ముందే వివిధ అమ్మవారి దేవాలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడానికి జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాచరణను రూపొందిస్తున్నారు. అంతేకాకుండా గత ఏడాది ఎక్కడైనా మిగిలిపోయిన అభివృద్ధి పనులను సైతం పూర్తి చేయడానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్ పాతబస్తీలో ఆయన సంబంధిత అధికారులు, ఉత్సవాల నిర్వాహకులతో కలిసి పర్యటించారు. ఆయా ఆలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత ఆలయాల కమిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉప్పుగూడ మహంకాళి ఆలయం నుంచి ప్రారంభమైన జోనల్ కమిషనర్ పర్యటన గౌలిపురా, సుల్తాన్‌షాహీ, లాల్ దర్వాజా, హరిబౌలి ద్వారా కోట్లా ఆలిజాలోని కోట మైసమ్మ ఆలయం వరకు కొసాగింది. ఉప్పుగూడ మహంకాళి ఆలయం ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశంలో కొత్తగా నిర్మించనున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ భూమి పూజకు ఈనెల 24న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వస్తున్నందున అందుకు సంబంధిత ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్ గౌడ్ జోనల్ కమిషనర్‌కు వివరించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కొన్ని ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై కూర్చొని దేవాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. సాధ్యమైనంత వరకు అవసరమైన అన్ని ఆలయాల వద్ద అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. ఈ అభివృద్ధి పనులన్నింటినీ ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు ముందే పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఊరేగింపు కమిటీ సభ్యులు శ్రీధర్, ఎస్.పి.క్రాంతి కుమార్, భవానీ శంకర్ గౌడ్, ఆకుల వేణు, మాణిక్ ప్రభు గౌడ్, పల్లె సుశీల్, బాబు రాజా, ప్యారసాని వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నేడు మీరాలంమండిలో కమిటీ సర్వసభ్య సమావేశం..

భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13న రాత్రి 7 గంటలకు మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, ప్రధాన కార్యదర్శి గాజుల రాహుల్ (గబ్బర్) తెలిపారు. ఈ ఏడాది జరగనున్న ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు.. ఆయా దేవాలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాతబస్తీలోని అన్ని దేవాలయాలకు చెందిన కమిటీల ప్రతినిధుల బృందం పాల్గొని గత ఏడాది జమా, ఖర్చుల వివరాలతో కూడిన యూటిలైజేషన్ సర్టిఫికెట్‌లతో పాటు ఈ ఏడాది ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కోరుకుంటున్నారో.. తదితర వివరాలను తమ వెంట తీసుకురావాల్సి ఉంటుందన్నారు.